
సాక్షి ఒడిశా

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.36.242లు, బంగారం 26 గ్రాముల 900 మిల్లీగ్రాములు వెండి 33 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాజీయే రాజమార్గం

కోర్టు కేసుల్లో రాజీయే రాజమార్గమని వక్తలు పేర్కొన్నారు.

- 8లో



ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చు

ఆస్పత్రికి తరలించడానికి ముందే అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందజేస్తే ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా కేంద్రాస్పత్రి వైద్యురాలు డాక్టర్ మమత చౌదరి అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

పాముకాటుతో బాలిక మృతి

జయపురం: నవరంగపూర్ జిల్లా డాబుగాం సమితి చెరచెటియగుడ గ్రామంలో సాదూరాం మఝి కుమార్తె సూర్యకంటి మఝి(16) పాముకాటుకు మృతి చెందింది. శుక్రవారం భోజనాలు కుటుంబ సభ్యులంతా ఇంట్లో నిద్రించారు. ఆ సమయంలో సూర్యకంటి కుడి చేతికి ఒక విషసర్పం కాటు వేయగా ఆమె హాహాకారాలు చేసింది. ఆమె ఆర్తనాదాలు విన్న కుటుంబ సభ్యులు లేచి చూడగా పాము కనిపించింది. సూర్యకంటిని పాము కాటు వేసిందని గమనించిన వారు వెంటనే డాబుగాం కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను నవరంగపూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సూర్యకంటి ప్రాణాలు వీడింది.

'సమస్యలు పరిష్కరించండి'



సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వచ్చిన మహిళలు

రాయగడ: తమ సమస్యలు పరిష్కరించాలని కొలనార సమితి బొడొకిల్లా పదర్ పంచాయతీ నేరేడిగుడ గ్రామానికి చెందిన మహిళలు కోరారు. ఈ మేరకు గ్రామానికి వచ్చిన కలెక్టర్ ఫరూల్ పట్వారికి వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. గ్రామంలో 14 కుటుంబాలకు చెందిన ఆదివాసీలు నివస్తున్నారు. ఇప్పటికీ ఈ గ్రామంలో సరైన మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. గ్రామంలో 14 మంది పిల్లలు చదువుకునేందుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పిండాపొదొరొ గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అయితే మధ్యలో నాగావళి నదిని దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.

రెండు జిల్లాలకు రెడ్ అలర్ట్

భువనేశ్వర్: ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బంగ్లాదేశ్‌లో తీరందాటి, గంటకు 8 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయువ్య దిశలో కదులుతోంది. ఇది రానున్న 48 గంటల్లో పశ్చిమ బెంగాల్ వైపు వెళ్తుందని వాతావరణ శాఖ ముందస్తు సంకేతాలు జారీ చేసింది. దీనివలన మయూర్‌భంజ్, కెంజొహర్ 2 జిల్లాలకు భారీ వర్షం వస్తుందని రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే బాలాసోర్, భద్రక్, సుందరగడ్, దేవగడ్, అంగుల్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక, ఢెంకనాల్, జాజీపూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్ ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సిబ్బంది

జయపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పలువురు పేర్కొన్నారు. 68వ బీమా వారోత్సవాల్లో భాగంగా ఉమ్మరకోట్ ఎల్ఐసీ బ్రాంచ్‌లో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఉమ్మరకోట్ ఎస్ఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ తులసీరాం మాఝి పర్యవేక్షణలో దాదాపు వంద మొక్కలు నాటారు. పాఠశాల హెచ్ఎం అనుపమ త్రిపాఠీ, పాఠశాల సిబ్బంది, ఎల్ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అంబులెన్స్ సేవలు పునః ప్రారంభం



బైకు అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదలలో బైక్ అంబులెన్స్ సేవలు శనివారం పునః ప్రారంభమయ్యాయి. మునిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆశిష్ కుమార్ పండ ముఖ్య అతిథిగా హాజరై బైక్ అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు. సమితిలోని 10 పంచాయతీల్లో దీనిద్వారా సేవలు అందనున్నాయి. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన ఈ సేవలు గత రెండేళ్లుగా నిలిచిపోయాయి. ప్రజల కోరిక మేరకు ఈ సేవలను మళ్లీ ప్రారంభించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కార్యక్రమంలో క్యారమ్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జీవన్ కుమార్ దీక్షిత్, అంబొదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు కాటు



విష సర్పాలకు సమయం వచ్చింది. ఈ సీజన్‌లో ఎక్కడికక్కడ కనిస్తుంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాటేస్తుంటాయి. పంట పొలాలు, పొదలు, పాత గోడల సందులు, గడ్డివాములు, పురిపాకల వద్ద అధికంగా సంచరిస్తుంటాయి. వర్షం పడిన సందర్భాల్లో ఎక్కువగా బయట ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా లేకపోతే తీవ్ర నష్టం సంభవిస్తుంది. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది.

– రాయగడ

- పెరుగుతున్న పాముకాటు మరణాలు
- అవగాహన లేమితో ప్రాణాపాయం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

ప్రస్తుతం చాలాచోట్ల పాముకాట్లుకు సయమానికి వైద్యం అందడం లేదు. పల్లెల్లో పరిస్థితి దారుణంగా ఉంది. చాలాచోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాముకాటుకు మందులు అందుబాటులో ఉండడం లేదు. కొన్నిచోట్ల మందులు అందుబాటులో ఉంటున్నా ప్రజల నిర్లక్ష్యం వలన సమాయానికి వైద్యమందక మృత్యువాత పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పాము కాటు వేస్తే మంత్రగాళ్లను ఆశ్రయిస్తుంటారు. అది ఎంత మాత్రం సమంజసం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎటువంటి పాము కాటువేసినా ఆస్పత్రులను సందర్శించాలని సూచిస్తున్నారు. పాముకాట్లు ఎక్కువగా పంట పొలాలకు వెళ్లే సందర్భాల్లో జరుగుతుంటాయి. రాత్రిపూట, తెల్లవారు జామున ఈ పరిస్థితి అధికంగా ఉంటుంది. రాత్రిపూట కాటువేసినా అది పాము అని గమనించుకోకపోవడం వలన ఇటీవల అనేక మరణాలు సంభవిస్తుండడం గమనించవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పాము కాటువేసిన వెంటనే ఏదైన సబ్బుతో ఆ ప్రదేశాన్ని శుభ్రంగా కడగాలి. అలాగే తాడుని గానీ గుడ్డను గాని గట్టిగా కట్టకూడదు. అయితే కొంతమంది అవగాహన లోపంతో పాముకాటు వేసిన వెంటనే గుడ్డను లేదా తాడును గట్టిగా కట్టి ఆ ప్రదేశానికి రక్త ప్రసరణ జరగకుండా చేస్తుంటారు. ఇది సరైన పద్ధతి కాదు. పాము కాటు వేసిన వెంటనే ఆస్పత్రికి **తీసుకొచ్చి చికిత్స చేయించాలి.** నొప్పికి **సంబంధించి** వైద్యులు **సూచించని** ఎటువంటి **పెయిన్ కిల్లర్ మెడిసిన్** వినియోగించకూడదు. గాయాన్ని ఐస్ లేదా నీటిలో ముంచకూడదు. అలాగే విషం **తీసే** ప్రయత్నం చేయకూడదు. రక్తం గడ్డ **కట్టకుండా** **ఆపే ప్రయత్నం** చేయాలి.

అందుబాటులో మందులు

రాష్ట్రంలోని ప్రతీ ప్రాంతంలో పాముకాటు కేసులు నమోదవుతున్నాయి. పాము కాటుకు గురైన వారిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే కావడం విశేషం. పాము కాటుకు యాంటీడోస్ ఇంజక్షన్లు అందబాటులో ఉన్నాయి. పాముకాటు ఆధారంగా తీవ్రతను దృష్టిలో పెట్టుకొని యాంటీ వీనమ్ ఇవ్వడం జరుగుతుంది.

లక్షణాలు

- పాము కరిచిన ప్రదేశంలో వాపు ఉంటుంది. దీని వల్ల కణజాలం దెబ్బ తింటుంది.
- పామ కాటుకు గురైతే లక్షణాలు కనిపించేంత వరకు వేచి ఉండకూడదు.
- పాము కాటు వేసిన అనంతరం కందరాలను విచ్ఛిన్నం చేస్తుంది. దీని వల్ల రక్తనాళాలు దెబ్బతింటాయి.
- విష పూరిత పాము కాటువల్ల రక్త స్రావం, తీవ్రమైన నొప్పి, రక్తం గడ్డ కట్టే సమస్యలు, మూర్ఛ, అస్పష్టమైన దృష్టి మొదలైన కలుగుతాయి.
- ఇటువంటి లక్షణాలు ఉంటే వైద్య **సహాయం తీసుకోవడంలో ఎటువంటి జాప్యం చేయకూడదు.**

సమయస్ఫూర్తితో వ్యవహరించాలి

పాముకాటు వేసినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించగలిగితే ప్రాణాపాయం నుంచి కాపాడుకోగలము. పాముకాటును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు అవగాహన లోపంతో పాముకాటు వేస్తే నాటువైద్యంపై ఆధారపడి ప్రాణాల మీదకు తెచ్చుకునే సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి. పాముకాటు వేసేటప్పుడు ఏర్పడే గాయం ఆధారంగా విష సర్పమో లేదో గుర్తించవచ్చు. ఎటువంటి పాము కరిచినా వెంటనే వైద్య సాయం పొందేందుకు ప్రాధాన్యమివ్వాలి.



డాక్టర్ ఎం.గౌతమ్,
జిల్లాకేంద్ర ఆస్పత్రి, రాయగడ



• సోయగం..!

జయపురం సమితి జాముంద పంచాయతీ చికిమ గ్రామ పరిసర ప్రాంతంలో శుక్రవారం జలపాతం అబ్బురపరచింది. ఇంతవరకు రాళ్ల క్వారీగా ఉంటున్న ఈ ప్రాంతంలో పర్వతం పైనుంచి నీరు జలజల పారుతున్న దృశ్యం ఆ ప్రాంత ప్రజలను కనువిందు చేసింది. ఈ జలపాతం శాశ్వతంగా ఉంటే ఈ ప్రాంతం పర్యాటక స్థలంగా రూపుదిద్దుకుంటుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జయపురం



• ప్రయాస

చిలికా సరస్సులో ప్రయాణికుల పడవ శనివారం చిక్కుకుంది. పడవలో 50 మందికి పైగా ప్రయాణికులు, 15 బైక్‌లు ఉన్నాయి. యాంత్రిక లోపం కారణంగా పడవ చిక్కుకుంది. సత్పొపాడా నుంచి జొహ్నకుదా వైపు వెళ్తుండగా మార్గమధ్యలో పడవ నిలిచిపోయింది. దీనిలో ప్రయాణికులను గమ్యం చేర్చేందుకు మరో పడవ ఘటనా స్థలానికి చేరి చేయూతనిచ్చింది.

- భువనేశ్వర్

ఆటో బోల్తా

- ఒకరు మృతి, నలుగురికి గాయాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ ఘాటీ వద్ద ఒక ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలో శనివారం ఉదయం రాలేగడ పంచాయతీలో ఒక ఆటోలో ముగ్గురు ప్రయాణికులు, అలాగే శఖపనాస గ్రామం వద్ద ఆరుగురు వ్యక్తులు ఎక్కారు. అయితే ఆ ఆటో చిత్రకొంఢ ఘాటీ వద్ద మలుపు తిరుగుతుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఐదుగురికి గాయాలవ్వడంతో ఝూన్‌బాయి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే ఒక మహిళ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలు చిత్రకొండ సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా సీలేరు మండలం కంచరిపేటకు చెందిన లక్ష్మీ కుంజామి (50)గా గుర్తించారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిత్రకొండ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పరిమితికి మించిన ప్రయాణికులతో వెళ్లడం వలనే ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. లక్ష్మీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



చిత్రకొండ ఆరోగ్య కేంద్రం వద్ద లక్ష్మీ కుంజామి మృతదేహం

విద్యాసంస్థలకు సెలవు

భువనేశ్వర్: ఒడిశా ప్రభుత్వం భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెప్టెంబర్ 17న సెలవుగా ప్రకటించింది. ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుభద్ర యోజనను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక జనతా మైదాన్‌లో భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ నేపథ్యంలో నగరంలో అన్ని పాఠశాలలు, కళాశాలలను ఆ రోజు పూర్తిగా మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలకు ఆరోజు ఒంటి పూట సెలవు ప్రకటించారు.

డయేరియాతో మరొకరి మృతి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో డయేరియాతో మరొకరు మృతి చెందారు. గత కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో డయేరియా వ్యాధి విజృంభించడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. టికిరి పంచాయతీలోని జమ్ముగుడ, కలియాపొడ గ్రామాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం జమ్ముగుడ గ్రామానికి చెందిన సచిన్ కుమార్ నాయక్ (54) అనే వ్యక్తి డయేరియాతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో నలుగురు డయేరియాతో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా టికిరిలో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలతో పీహెచ్‌సీని కొత్తగా ఏర్పాటు చేసింది. అందుకు సంబంధించి డాక్టర్‌ను కూడా నియమించింది.



డయేరియాతో చికిత్స పొందుతున్న రోగులు

అయితే కొద్ది రోజుల్లోనే డాక్టర్‌ను ఇతర ప్రాంతానికి బదిలీ చేయడంతో ప్రస్తుతం పీహెచ్‌సీలో డాక్టర్ లేకపోవడంతో చికిత్స కోసం వస్తున్న రోగులు తప్పనిసరిగా జిల్లా కేంద్రాస్పత్రిపై ఆధారపడాల్సి వస్తోంది. ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో రోగులు సరైన వైద్యం అందక నానా అవస్థలు పడుతున్నారు.

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న బీజేడీ నేతలు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ ప్రదీప్ మాఝి

మల్కన్‌గిరి: ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని నదులు పోటెత్తి వరదలు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరదలు వలన కలిమెల, పోడియా సమితుల్లో చాలా ఆస్తినష్టం జరిగింది. దీంతో ఆయా గ్రామాల్లో నవరంగ్‌పూర్ మాజీ ఎంపీ ప్రదీప్ మాఝి, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మనాస్ మాడ్కమి తదితరులు పర్యటించారు. కలిమెల, పోడియా, పొట్టేరు, బేజాంగ్‌వాడ, బప్పన్‌పల్లి, గిర్కాన్‌పల్లి, ముర్బాన్‌పల్లి, ఎంపీవీ 16, వెంకటాపాలేం, బద్లి తదితర గ్రామాల్లో వరద బాధితులకు బిస్కెట్స్, స్వీట్స్, అటుకులు, పంచదార తదితర నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాఝి మాట్లాడుతూ.. ముంపు ప్రాంతాల్లో ముందస్తుగా చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సకాలంలో బాధ్యత తీసుకొని ఉంటే ఇంత నష్టం జరిగేది కాదన్నారు. గోదావరి బ్యాక్ వాటర్ శబరి నదిలో కలిసిపోవడం వలన వరదలు ఎక్కువయ్యాయని, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాల్సిందని పేర్కొన్నారు. ఆయనతో పాటు మల్కన్‌గిరి జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టాంగులు, బీజేడీ కార్యకర్తలు గోపాల పాండ, దుర్గ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

'సుభద్ర'కు సన్నాహాలు

- ఈనెల 17న ప్రారంభించేందుకు ఏర్పాటు
- పథకాన్ని ప్రారంభించనున్న పీఎం మోదీ

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ప్రముఖ ప్రజాకర్షిత పథకం సుభద్ర యోజన ప్రారంభోత్సవం అట్టహాసంగా నిర్వహించేందుకు భారీ సన్నాహాలు చేస్తోంది. ఈనెల 17న ప్రధానమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు స్థానిక జనతా మైదాన్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం విశేషంగా కృషి చేస్తోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై చర్చించేందుకు రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశం స్థానిక లోకసేవ భవన్‌లో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన శనివారం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్ అనూగర్గ్, హోం శాఖ కార్యదర్శి సత్యబ్రత్ సాహు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వై.బి. ఖురానియా, భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఖుర్దా కలెక్టరేట్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శుభా శర్మ పథకం ప్రారంభానికి సంబంధించిన సన్నాహాలను సమావేశంలో వివరించారు.



సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా

విస్తృత ఏర్పాట్లు

ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చే ఈ కార్యక్రమానికి రాష్ట్ర యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏర్పాట్లను శాఖల వారీగా పర్యవేక్షిస్తూ సమన్వయంపై సమీక్షించారు. డీజీపీ, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శాంతి భద్రతలను పర్యవేక్షిస్తారు. జిల్లా కలెక్టర్ ఇతర ఏర్పాట్లను నిర్వహిస్తారు. అదనపు జనరేటర్లు, భద్రత, కార్కేడ్, ఆరోగ్య సంరక్షణ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, ప్రధానమంత్రికి తాత్కాలిక వసతి, రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ప్రధాన కార్యదర్శి సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యవసర సన్నద్ధత, బారికేడింగ్, ప్రజల వీక్షణ కోసం వివిధ ప్రదేశాల్లో ఎల్ఈడీ లైట్లు, మొబైల్ టాయిలెట్లు మరియు రోడ్ల వెంబడి బయో-టాయిలెట్ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. సమాచార మరియు పౌరసంబంధాల శాఖ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం కోసం మీడియాకు సింగిల్ ఫీడ్ సిస్టమ్‌ను అందిస్తుంది. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి మరింత సమాచారం కోసం రాష్ట్ర హోం వ్యవహారాల శాఖ (ప్రోటోకాల్) కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంచుతుంది. సెప్టెంబర్ 17న ఉదయం 11.35 గంటలకు భువనేశ్వర్ విమానాశ్రయానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేరుకుంటారు. అనంతరం ఉదయం 11.55 గంటలకు జనతా మైదాన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని, మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి న్యూఢిల్లీకి బయల్దేరుతారు.

క్లుప్తంగా

జలాశయం గేట్ ఓపెన్



డ్యామ్ గేట్ నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

జయపురం: అప్పర్ కొలాబ్ జల విద్యుత్ ప్రాజెక్టులో జలాశయం డ్యామ్‌లో ఒక గేటును అధికారులు శనివారం తెరిచినట్లు ప్రాజెక్టు ఇంజినీర్ నీలామణి జ్ఞానచంద బెహర వెల్లడించారు. ప్రాజెక్టు జలాశయ నీటిమట్టం 858 మీటర్లు కాగా, సాయంత్రానికి 857.10 మీటర్లు ఉందని ప్రతి సెకెండ్‌కు 130 ఘన మీటర్ల నీరు చేరుతోందని, అందువలన ముందు జాగ్రత్తగా ఒక గేటు తెరిచి నీరు వదుతున్నట్లు వెల్లడించారు. గేటు తెరవడం వలన ప్రతీ సెకన్‌కు 60 ఘనపు మీటర్ల నీరు బయటకు వెళ్తోందన్నారు.

సంజుక్తా శెఠికి ఘన స్వాగతం



సంజుక్తాకు స్వాగతం పలుకుతున్న తోటి సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో గత 25 ఏళ్లుగా నర్సుగా విధులు నిర్వహించి, ఉత్తమ నర్సుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఫ్లోరెన్ నైటింగేల్ అవార్డు పొందిన సంజుక్తా శెఠి శనివారం మల్కన్‌గిరి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు సహోద్యోగులు, మెడికల్ సిబ్బంది స్థానిక బస్టాండ్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఆమె మరిన్ని అవార్డులు అందుకోవాలని అభినందనలు తెలిపారు.

నవరంగపూర్ జిల్లా క్రికెట్ టీమ్ ప్రకటన



ఎంపికైన క్రికెట్ టీమ్‌తో జిల్లా అధికారులు

జయపురం: అంతర్ జిల్లా విద్యాలయాల క్రికెట్ టోర్నమెంట్ కోసం నవరంగపూర్ జిల్లా టీమ్‌ను జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి ప్రహ్లాద త్రిపాఠి శనివారం ప్రకటించారు. స్థానిక స్టేడియంలో అండర్-16 క్రికెటర్ల ఎంపిక శనివారం జరిగింది. ఎంపికైన 15 మంది ప్రాబబుల్స్‌కి కెప్టెన్‌గా అంశుమాన్ పండను నియమించారు. ఆటగాళ్లుగా లావాన్ లాజే, యువరాజ్ పాయిక్, సాయిరుద్ర పాత్ర, భరత్ సాహు, స్వాధీన పట్నాయక్, సిద్ధార్థ పట్నాయక్, పంకజ శతనామి, రాజదీప్ బాలా, సంబిత్ పాణిగ్రహి, దేవేంద్రధ్ర కుమార్ రౌత్, అంశుమాన్ పట్నాయక్, ఎ.అక్షిత్, బిభుదత్త మిశ్ర, బైరవ కుమార్ బెహరలు ఉన్నారు.

శ్రీమందిరం కలకలంపై చర్యలు

భువనేశ్వర్ : పూరీ శ్రీమందిరం శిఖరం నీలచక్రం ప్రాంగణంపైకి ఎక్కిన వ్యక్తికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టారు. నిందిత వ్యక్తి గంజాం జిల్లా ఛత్రపురానికి చెందిన బలరాం మహరణా పేరిట కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో వివరణ కోరుతూ 7 రోజుల తాఖీదులు జారీ చేశారు. వృద్ధుని ఆరోగ్యం బాగులేదు. మందులు వాడుతున్నందున కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. 7 రోజుల తర్వాత పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని, మెడికల్ పేపర్లు చూపించాలని ఆదేశించారు.

హుండీ పగలగొట్టి..

హిరమండలం: కిట్టాలపాడు గ్రామంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీ దొంగతనం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆంజనేయస్వామి గుడిలో చొరబడి హుండీని ఎత్తుకెళ్లి పగలగొట్టి పొదల్లో పడేశారు. ఆ సమయంలో వినాయక ఉత్సవాల దగ్గర భజన కార్యక్రమం ముగించి గుడి వైపు వస్తున్న కొంతమంది గ్రామస్తులు వారిని గమనించి పట్టుకోవడానికి ప్రయత్నించగా ఇద్దరు ఒకరు దొరికిపోవడంతో అతడిని చెట్టుకు కట్టేశారు. శనివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ మహ్మద్ యాసిన్ చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 2719 కేసులు రాజీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో శనివారం జిల్లా వ్యాప్తంగా 2719 కేసులు రాజీ అయ్యాయి. జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని వివిధ కోర్టుల్లో శనివారం లోక్ అదాలత్‌ను నిర్వహించారు. జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో అదాలత్‌ను నిర్వహించారు. అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సీహెచ్ యుగంధర్, బెంచ్‌లో ఒక కేసులో వాది ప్రతివాదులైన రెడ్డి శ్రీనివాసరావు, రెడ్డి కృష్ణవేణి దంపతులు ఇరువురు తమ వైవాహిక జీవితాన్ని కొనసాగించడానికి అదాలత్‌లో రాజీకి వచ్చి ఒప్పుకున్నారు.

రాజీయే రాజమార్గం

రాయగడ: కోర్టు కేసుల్లో రాజీయే రాజమార్గమని వక్తలు పేర్కొన్నారు. స్థానిక జిల్లా సెషన్స్ కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. జిల్లా జడ్జి సత్యనారాయణ షడంగి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి శుభ్రత్ ఆచార్యల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని గుణుపూర్, మునిగుడ, కాసీపూర్, పద్మపూర్ కోర్టులకు చెందిన 348 కేసులు, 12,530 రెవెన్యూ కేసులు, 9 లేబర్ కేసులు, ప్రీలిటిగేషన్ సంబంధిత 16 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మనాభ దాస్ తదితరులు పాల్గొన్నారు.



జయపురం: జయపురంలో కేసులు విచారిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కోర్టులో లోక్ అదాలత్‌ను జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రాధికరణ అధ్యక్షుడు ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ పర్యవేక్షించారు. జిల్లా కోర్టులో అనేక జాతీయ బ్యాంకులు, కోర్టుల్లో విచారణలో ఉన్న కేసులను వివిధ హోదాల్లో న్యాయమూర్తులు విచారించారు. లోక్ అదాలత్‌లో మొత్తం 2,667 కేసులు పెండింగ్‌లో ఉండగా, 1447 కేసులు విచారణ జరిపారు. అలాగే వివిధ జాతీయ బ్యాంకుల్లో ఎగవేతదారుల కేసులు 1,061కి గాను 96 పరిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా ప్రాధికరణ కార్యదర్శి అశోక్ కుమార్, అదనపు జడ్జి ప్రదీప్ కుమార్ సామల్, ముఖ్య విచారణాధికారి నోత్తోత్తమ శెఠి, సబ్ జడ్జి సంతోష్ కుమార్ అగర్వాలల్, సబ్ డివిజనల్ జడ్జి విష్ణుప్రియా సాయంతరాయ్, ఫస్ట్‌క్లాస్ మాజిస్ట్రేట్ సుభాషిస్ పాణి తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: జిల్లా కోర్టులో కేసుల విచారణ జరుపుతున్న జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్



రాయగడ: కేసులను పరిశీలిస్తున్న జడ్జి షడంగి

జయపురం: కొరాపుట్ జిల్లా జడ్జి రాజేష్ ఎక్కా పర్యవేక్షణలో జయపురం జిల్లా జడ్జి కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహించారు. అలాగే కోర్టు పరిధి కొరాపుట్, కోట్‌పాడ్, లక్ష్మీపూర్, సెమిలిగుడ, బొరిగుమ్మ, దసమంతపూర్, లమతాపుట్ కోర్టుల్లో సైతం లోక్ అదాలత్ చేపట్టారు. వివిధ లోక్ అదాలత్‌లలో మొత్తం 5,165 కేసులను పరిష్కరించారు.

ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చు



జయపురం: ప్రథమ చికిత్స చేసే విధానం తెలియజేస్తున్న పండ

రాయగడ: ఆస్పత్రికి తరలించడానికి ముందే అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందజేస్తే ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా కేంద్రాస్పత్రి వైద్యురాలు డాక్టర్ మమత చౌదరి అన్నారు. స్థానిక అటానమస్ కళాశాల ప్రాంగణంలో శనివారం జరిగిన ప్రథమ చికిత్స దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆపత్కాల సమయంలో రోగించి అందించాల్సిన ప్రథమ చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బబిలత షరఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకుడు ఎ.శ్రీనివాస్, జాతీయ సేవా సమితి అధ్యక్షుడు ఏవీ భాస్కర గుప్త, ఉదయ్ నాయక్, కేశవ్ కుమారి జాని, తృప్తిమయి భొయ్ తదితరులు పాల్గొన్నారు.

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జూనియర్ రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ యజ్ఞేశ్వర పండ మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స అందజేయడం అత్యవసరమన్నారు. అటువంటి సమయాల్లో జూనియర్ రెడ్‌క్రాస్ కార్యకర్తలు నిర్వహించాల్సి భూమికపై వివరించారు. కార్యక్మరంలో హెచ్‌ఎం ప్రకాశ చంద్ర పట్నాయిక్, జూనియర్ రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ శుభశ్మిత సాహు, ఉపాధ్యాయులు విశ్వరంజన్ గౌఢ, భగవాన్ శాబత్, దేవేంద్ర కుమార్ పాఢీ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: మాట్లాడుతున్న బబిలత, వేదికపై డాక్టర్ చౌదరి తదితరులు

నేడు సుభద్ర స్వాగత్ పాదయాత్ర

భువనేశ్వర్: సుభద్ర యోజనపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో సుభద్ర స్వాగత్ పాదయాత్ర నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 వేల పాదయాత్రలు నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ప్రకటించారు. మహిళలు ప్రధానంగా స్వయం సహాయక బృందం (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు, సుభద్ర యోజన గురించి అవగాహన కల్పించి గ్రామీణ స్థాయిలో పథకాన్ని స్వాగతించడానికి కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రతీ పంచాయతీ స్థాయిలో గ్రామ పంచాయతీ స్థాయి సమాఖ్య (జీపీఎల్ఎఫ్) నాయకుల ఆధ్వర్యంలో పాదయాత్రలు జరుగుతాయని వెల్లడించారు. మిషన్ శక్తి విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ నగరంలో రాష్ట్రస్థాయి పాదయాత్రను గిరి దుర్గా దేవాలయం నుంచి ప్రారంభించి రమాదేవి మహిళా విశ్వవిద్యాలయం వరకు నిర్వహిస్తాయని తెలిపారు. సుభద్ర పథకం కింద దాదాపు 50 లక్షల మంది మహిళలు నమోదు చేసుకున్నందున, సెప్టెంబర్ 15 నాటికి ప్రక్రియను పూర్తి చేసిన వారికి సెప్టెంబర్ 17న భువనేశ్వర్‌లో జరిగిన మెగా ఈవెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ యోజన ప్రారంభించడంతో పాటు ఆర్థిక సహాయం అందుతుంది. సుభద్ర స్వాగత్ పాదయాత్ర రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రోత్సహించడం మరియు మహిళలకు సాధికారత కల్పించడం లక్ష్యంగా పేర్కొన్న విషయం తెలిసిందే.

అధికారులు అందుబాటులో ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

భువనేశ్వర్: పరిపాలనాపరమైన అవసరాల దృష్ట్యా ప్రభుత్వ సెలవు దినాల్లో తమ ప్రధాన కార్యాలయాలను వదిలి వెళ్లకుండా అందుబాటులో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈనెల 14వ తేదీ నుంచి 16 వరకు ప్రభుత్వ సెలవు దినాలు. అందువలన సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం అదనపు చీఫ్ సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్ కమ్ సెక్రటరీలు, అన్ని విభాగాల ప్రముఖులకు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా అవసరాల దృష్ట్యా సెలవు దినాల్లో ఏ ప్రభుత్వ అధికారి కూడా ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లడానికి అనుమతించబడరు. అవసరమైతే అధికారులు పిలుపు మేరకు తక్షణమే కార్యాలయానికి హాజరవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సుభద్ర యోజన ప్రారంభోత్సవం పురస్కరించుకుని ఈనెల 17న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈ పర్యటన భారీ స్థాయిలో విజయవంతం చేసే యోచనతో ప్రభుత్వం అధికారులు సెలవు దినాల్లో ప్రధాన కార్యాలయం పరిధి దాటకుండా అనుక్షణం అందుబాటులో ఉంచేందుకు ముందస్తుగా ఈ ఉత్తర్వులను జారీ చేసినట్లు భావిస్తున్నారు.

అడవలో బొలేరో వాహనం బోల్తా

పర్లాకిమిడి: అడవ పోలీసుస్టేషన్ పరిధిలోని పోదాగాం వద్ద ఒక బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తాపడిన దుర్ఘటనలో ఏడుగురుకి గాయాలైనట్లు అడవ పోలీసు అధికారులు తెలియజేశారు. శనివారం రాష్ట్రీయ లోక్ ఆదాలత్ పని ముగించుకుని ఒకే కుటుంబానికి చెందిన పదకొండు మంది మోహనా బ్లాక్ గులుబ పంచాయతీ కమ్మపోదా గ్రామానికి తిరిగి వస్తుండగా, బొలేరో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులను మోహనా మెడికల్‌కు తరలించారు. గాయాలైన ఏడుగురిలో నలుగురు మహిళలు, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నట్లు సమాచారం. అడవ, మోహనా పోలీసుస్టేషన్ పోలీసు అధికారులు సంఘటన స్థలానికి విచ్చేసి కేసును విచారిస్తున్నారు. బొలేరో వాహనంలో మొత్తం 12 మంది బరంపురం నుంచి అడవ గ్రామానికి వస్తున్నట్లు తెలిసింది.

నాటుకోళ్ల మృతిపై విచారణ

కోటబొమ్మాళి: బలరాంపురం గ్రామంలో నాటుకోళ్ల మృతిపై శనివారం వెటర్నరీ ఏడీ మంద లోకనాథం విచారణ చేపట్టారు. మృతి చెందిన కోళ్ల నమూనాలు సేకరించారు. వివరాలు ఆరా తీసి కోళ్లకు టీకాలు వేశారు.

మాకివలస కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా



మాకివలసలో నిల్వ ఉంచిన ఇసుక పోగులు

జలుమూరు: జలుమూరు మండలంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. మొన్న పర్లాం, నిన్న రామకృష్ణాపురం, నేడు మాకివలస గ్రా మం కేంద్రాలుగా ఇసుక ట్రాక్టర్లు, లారీలతో అక్రమ రవాణా సాగిస్తున్నారు. మాకివలసకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకుల కనుసన్నల్లో ఇదంతా జరుగుతోంది. మాకివలస టీడీపీ నా యకుని కల్లం స్థలంలోనే గ్రామానికి పక్కనే ఉన్న వంశధార నది నుంచి 200 మిషన్లతో ట్రాక్టర్లకు లోడింగ్ చేయించి ఇక్కడే నిల్వ చేస్తు న్నారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత బెంజ్ లారీలకు లోడింగ్ చేసి విశాఖ తరలిస్తున్నా రు. సరుబుజ్జిలి వద్ద గ్రామస్తులు ఆ లారీలను అడ్డుకోగా.. మండల టీడీపీ నాయకుడు చొరవ తీసుకొని లారీకు కొంత మొత్తం ఇవ్వ జూపి ప ని కానిచ్చేస్తున్నారు. ఈ నాయకులపై మిగిలిన నాయకులు అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై ఎస్‌ఐ అశోక్ బాబు మాట్లాడుతూ రాత్రిపూట షిఫ్ట్ డ్యూటీలు వేస్తున్నామన్నారు.

టోల్‌గేట్ వద్ద లారీల క్యూ



మడపాం టోల్‌గేట్ వద్ద ఉన్న లారీలు

నరసన్నపేట: మండల పరిధిలో వంశధార గుల్లవుతోంది. గోపాలపెంట, లుకలాం, ఉప్పరిపేటల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఈ తవ్వ కాలు జరుగుతున్నాయి. సెబ్ పోలీసులు లేకపోవడంతో ఇసుక తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. మడపాం టోల్‌గేట్ వద్ద క్యూ కట్టిన లారీలే ఇందుకు సాక్షి. రాత్రి సమయాల్లోనే ఇక్కడ ఇసుక తరలింపు జరుగుతోంది. వంశధారలో నీరు వచ్చినా లుకలాం, గోపాలపెంటల్లో ఇసుక తవ్వకాలకు అనువుగా ఉంటుంది. దీన్ని అవకాశంగా తీసుకొని ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు.

పల్లె తల్లడిల్లుతోంది..



చాపర పీహెచ్‌సీలో ఓపీ రోగులకు తమ పరిస్థితులను వివరిస్తున్న వైద్యురాలు

- జిల్లాలో గ్రామీణ వైద్య సేవలు బంద్
- గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఓపీ రోగులకు తప్పని పాట్లు
- అత్యవసర సేవలకు మాత్రమే అటెండ్ అయిన పీహెచ్‌సీ వైద్యులు
- 17 నుంచి నిరాహార దీక్షలకు సన్నాహాలు
- ఇప్పటికే అధికారిక సమావేశాలకు హాజరుకాకూడదని నిర్ణయించిన వైద్యులు

అరసవల్లి: గ్రామీణ, ఏజెన్సీ వైద్యులు బంద్‌కు పిలుపునివ్వడంతో జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వ ఇన్ సర్వీస్‌తో పీజీ సీట్ల కేటాయింపు కోటాను కుదించేలా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలన్న ఏకైక డిమాండ్‌తో ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం పిలుపుతో జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో వైద్య సేవలు శనివారం నుంచి నిలిచిపోయాయి. రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల టెలీ కాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లను కూడా పీహెచ్‌సీ వైద్యులు బాయ్‌కాట్ చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు తీవ్రతరమవుతున్న తరుణంలో రోగులకు వైద్యుల సేవలు అందుబాటులో లేకపోవడం ఇబ్బందిగా మారింది. జిల్లాలో ఉన్న మొత్తం 71 పీహెచ్‌సీల్లో మొత్తం సుమారు 124 మంది గ్రామీణ వైద్యులు రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా నిరసిస్తూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర పీహెచ్‌సీ సంఘ వైద్యుల సంఘ ప్రతినిధుల పిలుపుమేరకు ఈ నెల 10 నుంచే దశలవారీగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం కనిపించకపోవడంతో యథావిధిగా షెడ్యూల్ ప్రకారం శనివారం నుంచి వైద్య సేవలను పూర్తిగా బంద్ చేశారు.

అసలే జ్వరాలు.. ఆపై బంద్‌లు

జిల్లాలో మొత్తం 71 పీహెచ్‌సీలు గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో శనివారం నుంచి అత్యవసర సేవలు మినహా ఇతర వైద్య సేవలన్నీ బంద్ కావడంతో స్థానికులు ముఖ్యంగా సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్లలో ఉన్న అన్ని పీహెచ్‌సీల్లో శనివారం ఉదయానికి వైద్యులంతా విధులకు హాజరైనప్పటికీ ఎలాంటి ఓపీ కేసులను చూడలేదు. ఒకట్రెండు చోట్ల అత్యవసర కేసులను మాత్రం పరిశీలించి మెరుగైన చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. పరిస్థితులు విషమించిన వారికి, గర్భిణులకు మాత్రం ఒకింత సహకరించి పరీక్షలు చేసి పంపించారు. మామూలుగా రోజుకు ఒక్కో పీహెచ్‌సీకి ఓపీ కేసులు కనీసంగా 40 నుంచి 50 వరకు నమోదయ్యేవి. ఈ లెక్కన శనివారం ఒక్కరోజే జిల్లాలో సుమారు 3 వేల మందికి పైగా ఓపీ సేవలు అందనట్టైంది.

నేడు చలో విజయవాడ

గ్రామీణ వైద్యుల ఆందోళన మరింత తీవ్రతరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీరి డిమాండ్‌పై ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా బాధ్యత వహించకుండా వ్యవహరిస్తున్న రాష్ట్ర సర్కార్‌పై వైద్యులు భగ్గుమంటున్నారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఆదివారం 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లాలో పీహెచ్‌సీ వైద్యులంతా కలిసి విజయవాడ వెళ్లి అక్కడే హెల్త్ డైరెక్టరేట్‌ను మరోసారి కలవనున్నారు. అయితే షెడ్యూల్ నోటీస్ ప్రకారం మంగళవారం నుంచి వైద్యులు నిరాహార దీక్షలకు దిగుతున్నట్లుగా తెలుస్తోంది. ఇదే జరిగితే గ్రామీణ ప్రాంత వైద్యానికి పెద్ద బ్రేక్ పడనుంది. వేలాది మంది గ్రామీణ రోగులకు తీవ్ర ఇబ్బందులు తప్పేలాలేవు.

రోగులకు సేవ చేయడంలోనే ఆనందం

రాయగడ: రోగులకు సేవలు చేయడంలోనే ఆనందం ఉంటుందని ఆస్ట్రేలియాలోని మోనస్ స్కూల్ ఆఫ్ రూరల్ హెల్త్ సంస్థకు చెందిన నర్సింగ్ విభాగం కన్వీనర్ ప్రొఫెషర్ మార్క్ హెల్డ్ అన్నారు. స్థానిక పితామహల్‌లోని సెంచురియన్ విశ్వ విద్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నర్సింగ్ విభాగంలో చదువుతున్న విద్యార్థుల్లో ఆత్మస్థైర్యంతో పాటు సేవా దృక్పథం అవసరమని పేర్కొన్నారు. అటువంటప్పుడే వారు ఆయా రంగంల్లో రాణించగలరని అభిప్రాయపడ్డారు. ఆయనకు వర్సిటీ రాష్ట్ర శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కుమార్ ఝా, రాయగడ శాఖ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ పాఢిలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.అనంతరం విశ్వ విద్యాలయంలో అన్ని విభాగాలను పరిశీలించారు.



హెల్డ్‌కు స్వాగతం పలుకుతున్న డాక్టర్ పాఢి, పక్కనే ఝా

హోరాహోరీగా టెన్నీకాయిట్ పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 36వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల (రాష్ట్ర స్థాయి) బాల బాలికలు టెన్నికాయిట్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పోటీల్లో క్రీడాకారులు ముందుగా ఫ్లాగ్ మార్చ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ క్రీడాకారులకు క్రీడలతో ఉన్నతమైన గుర్తింపు లభిస్తుందని అన్నారు. పోటీలకు కృష్ణా, ప్రకాశం జిల్లా క్రీడాకారులు మినహా మిగిలిన జిల్లాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఆటలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ క్రీడలకు పోత్సహించిన డాక్టర్ తమ్మినాన పాపినాయుడు, డాక్టర్ అన్నెపు సుశీలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సంతోష్ కుమార్, కార్యదర్శి ఎస్‌వీ జోగారావు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిప్రజ్వలన చేస్తున్న అధికారులు

ఆస్పత్రిలో వైద్య సేవలపై అసంతృప్తి

టెక్కలి: రాష్ట్రంలో గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కనీసం బీమా సైతం చెల్లించలేదని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. శనివారం టెక్కలిలో పర్యటించారు. ముందుగా స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం విభాగం, బయోవేస్ట్ మెడికల్ విభాగం ఏర్పాటుపై స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆస్పత్రికి సమీపంలో గోశాల నిర్మాణంపై స్థల పరిశీలన చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్ను వసూళ్లు సక్రమంగా నిర్వహించాలని మంత్రి అచ్చెన్న ఆదేశించారు. రైతులను అన్ని విధాలా ఆదుకునేది తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్నారు. ఇటీవల విజయవాడ వరదల్లో సహాయక చర్యల్లో 95 శాతం మేర సంతృప్తి చెందామన్నారు. ప్రతిపక్ష నాయకుడు జగన్ బెంగళూరు ప్యాలెస్ నుంచి విమర్శించడం కాదని, ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం మేజర్ పంచాయతీలో ఫుట్‌పాత్ దుఖాణదారులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పీఎం, బయోవేస్ట్ మెడికల్ విభాగం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు

13.57 కిలోల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం: పట్టణంలో గంజాయిని అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను రైల్వేస్టేషన్ రోడ్‌లో గల ఆర్ అండ్ బీ బంగ్లా సమీపంలో శనివారం పట్టుకున్నారు. ఈ విషయమై సాయంత్రం సీఐ మీసాల చిన్నంనాయుడు విలేకరులతో మాట్లాడారు. ముందస్తు సమాచారం మేర కు ఒడిశాలోని కందమాల్ జిల్లా దరింగబడి నుంచి అక్రమంగా గంజాయిని బెంగళూరుకి రవాణా చే సేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వీరి వద్ద నుంచి 11.07 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీ నం చేసుకున్నారు. కర్నాటక రాష్ట్రం, షిమోగ జిల్లా, కరెకల్ గ్రామం ఇందిరానగర్ కాలనీ చెందిన ఎస్.రాజేష్, హరేజ్ గ్రామానికి చెందిన జి.మధులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం

ఆమదాలవలస: పట్టణంలోని బీఆర్ నగర్ సమీపంలో ఐదుగురు యువకుల నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు శ్రీకాకుళం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వివేకానంద తెలిపారు. శనివారం సీఐ కార్యాల యంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ, ఎస్ ఐ కె.వెంకటేష్ కలిసి శుక్రవారం సాయంత్రం బీఆర్ నగర్ సమీపంలో దాడులు నిర్వహించగా ఐదుగురు యువకులు పట్టుపడ్డారని తెలిపారు. వారి వద్ద నుంచి చిన్న చిన్న పొట్లాలుగా కట్టిన రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేశామన్నారు. పోలీసు విచారణలో ఐదుగురు యువకులు ఒడిశా రాష్ట్రం నుండి గంజాయిని దిగుమతి చేసి పట్టణంలో విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ 22వ వార్డు లక్కుడిపేటకు చెందిన కిల్లి మణికంఠ (21) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మణికంఠ తండ్రి అన్నంనాయుడు విశాఖపట్టణంలో ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అక్కడే ఉండి చదువుకుంటున్న మణికంఠ శనివారం తండ్రిని తన బైక్‌పై డ్యూటీ పాయింట్‌కు దించి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో హనుమంతు వాక ప్రాంతంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే చనిపోయాడు. అన్నంనాయుడుకు పెళ్లయిన చాలాకాలానికి పిల్లలు పుట్టకపోతే, అయ్యప్ప మాల వేసుకుని మొక్కుకుంటే మణికంఠ జన్మించాడు. ఇప్పుడు ఒక్కగానొక్క కుమారుడు ఇలా దూరమవ్వడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు.

యువకుడి మృతికి వైఎస్సార్‌సీపీ నాయకులు దుంపల చిరంజీవిరావు, పార్టీ కార్యకర్తలు బొడ్డేపల్లి విజయ్‌కుమార్, దుంపల శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ గోవిందరావు, తదితరులు

కొమరాడ: మండలంలోని పాత గుణాన పురం రబ్బబండ వద్ద సీతానగరం మండలం నిడగళ్లు గ్రామానికి చెందిన కుప్పిలి పాపారావు (34) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు, కొమరాడ ఎస్సై నీలకంఠం శనివారం గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

రేగిడి: మండలంలోని బొడ్డవలస నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను రేగిడి ఎస్సై పి.నీలావతి, సిబ్బంది శనివారం సీజ్ చేశారు. పట్టుబడిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై నీలావతి మాట్లాడుతూర, బొడ్డవలస గ్రామం వద్ద గల పైలెట్ ప్రాజెక్ట్ నీటిపథకం సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో వాహనాలను సీజ్ చేశామని చెప్పారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

మెరకముడిదాం: మండలంలోని శ్యామాయవలసలో శనివారం తెల్లవారుజామున ముగ్గురు యువకులు గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసులు తెలియజేసిన వివరాల మేరకు... తెర్లాం మండలం పెరుమాళి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు, రంగప్పవలసకు చెందిన మరో యువకుడు తెల్లవారు జాము 3 గంటలకు శ్యామాయవలస నుంచి ఉత్తరవల్లి వైపు వెళ్తున్నారు. అయితే వీరి ప్రవర్తన అనుమానంగా ఉండడంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు ప్రశ్నించగా... వారి వద్ద నుంచి 15 కిలోల గంజాయి లభించింది. దీంతో స్థానికులు బుధరాయవలస పోలీసులకు సమాచారం చేరవేయగా.. వెంటనే గరివిడి ఏఎస్సై రమణ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామానికి చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 15 కిలోల గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌చార్జ్ ఎస్సై బి.లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

రాజాం సిటీ: గ్రామీణ ప్రాంతాల్లోని చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని వెలుగు ఏసీ ఎ.చిరంజీవి తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. బీఎస్సీ కెమిస్ట్రీ చదువుకుని 19 నుంచి 27 ఏళ్ల వయసు కలిగిన యువత విజయనగరం టీటీడీసీలో జరగనున్న ప్రొడక్షన్ కెమిస్ట్ శిక్షణకు హాజరుకావాలన్నారు. నాలుగు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. విజయనగరం సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్టోర్‌కీపర్, సెక్యూరిటీ ఉద్యోగాలకు శిక్షణ ఇస్తుందన్నారు. స్టోర్‌కీపర్‌లకు ఇంటర్మీడియట్ లేదా ఐటీఐ చదువుకుని 19 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అలాగే డిగ్రీ విద్యార్థులకు సెక్యూరిటీ ఆఫీసర్ శిక్షణ ఇవ్వనున్నారన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువకులు 10వ తరగతి సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, జాబ్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు అకౌంట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆయా కేంద్రాలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఐకేపీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

కుదిరిన ఒప్పందం

విజయనగరం టౌన్: జేఎన్‌టీయూ, అక్షయాన్ గ్రీన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి శనివారం తెలిపారు. ఆరు అంశాలపై ఒప్పందం కుదిరిందన్నారు. వాటిలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్స్ ఫర్ ది ఎంప్లాయీస్, స్టూడెంట్స్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టెక్నాలజీ ఫ్రమ్ అకాడమీ టు ఇండస్ట్రీ తదితరవి ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ జి.జయసుమ, డాక్టర్ జీజే నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

పసుపు సాగుపై పెరుగుతున్న ఆసక్తి


మండ ప్రాంతంలో వేసిన పసుపు

- ప్రత్యామ్నాయ పంటగా కొండపోడులో సాగు
- ఎకరాకు 25-30 కావిళ్ల వరకు దిగుబడి
- పచ్చి పసుపు కావిడ ధర రూ.600 నుంచి రూ.700
- ఎక్కువగా ఆసక్తి చూపుతున్న గిరిజన రైతులు

మండలం	పసుపు సాగు (హెక్టార్లలో)
సాలూరు	220
సీతంపేట	1120
మక్కువ	69
పాచిపెంట	65

సీతంపేట:

జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో పసుపు సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. గిరిజన రైతులు ఎక్కువగా ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో దాదాపు 1474 హెక్టార్లలో పసుపు పంటను సాగుచేస్తున్నారు. ఇక్కడి పసుపు పంటకు నాణ్యమైనదిగా గుర్తింపు ఉండడంతో మైదాన వ్యాపారులు సైతం వచ్చి ఏజెన్సీ సంతల్లో పసుపు కొమ్ములు పచ్చివి, ఎండువి కొనుగోలు చేస్తుంటారు. కొండ పోడులో భాగంగా పసుపు పంట వేస్తారు. జీడిపంటలో అంతరపంటగా సాగుచేస్తారు. కుశిమి, శంభాం, జొనగ, దోనుబాయి, మర్రిపాడు, పొల్ల, కడగండి తదితర పంచాయతీల పరిధిలో ఈ పంట సాగవుతుంది. ఉద్యానవనశాఖ కూడా గతంలో ఈ పంటను ప్రోత్సహించేది. పసుపు విత్తనాలు కూడా ఇచ్చేవారు. అయితే కొన్నేళ్లుగా రైతులకు పసుపు విత్తనాలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. రైతులే విత్తనాలు తయారు చేసుకుని సాగుచేస్తున్నారు. అంతగా పెట్టుబడులు లేకపోవడంతో గిరిజన రైతులు ఈ పంటను ఎక్కువగా పండిస్తున్నారు. మైదాన ప్రాంతాలతో పోలిస్తే ఏజెన్సీలోనే అధిక విస్తీర్ణంలో పసుపు సాగవుతోంది.

ప్రాసెసింగ్ యూనిట్‌లో పసుపు తయారీ..

సీతంపేట ఏజెన్సీలోని దిబ్బగూడలో వీడీవీకే ఆధ్వర్యంలో పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను గతంలో నెలకొల్పారు. దీని ద్వారా పసుపు గుండ ప్యాకెట్‌లు తయారుచేసి నాణ్యమైన పసుపును విక్రయిస్తున్నారు. ఇక్కడి పసుపు ఉత్పత్తికి చాలా డిమాండ్ ఉంది. రూ.7 కోట్లతో పసుపు ప్రాసెసింగ్ యూనిట్ పెట్టడానికి అధికార యంత్రాంగం త్వరలో చర్యలు తీసుకుంటుందని సంబంధిత వెలుగు అధికార వర్గాలు తెలిపాయి.

అంతర పంటగా..

అంతర పంటగా గిరిజనులు పసుపు పండిస్తున్నారు. ఎకరా పొలంలో 10 కావిళ్ల వరకు పసుపు విత్తనాలు నాటుతారు. బాగా పండితే 25 నుంచి 30 కావిళ్ల వరకు దిగుబడి వస్తుందని గిరిజనులు చెబుతున్నారు. ఈ మొక్కలు ఏపుగా పెరగడానికి ప్రతిసారీ కలుపు మొక్కలను ఏరివేయాలని వర్షపాతం తగినంత ఉన్నట్లయితే ఏడాదిలో రెండు సార్లు పసుపుదుంపలను తవ్వుకోవచ్చంటున్నారు. విజయదశమి పండగ వచ్చేసరికి కొంత దిగుబడి వస్తుందని గిరిజనులు తెలిపారు. ఒక్కో కావిడ రూ.600ల నుంచి రూ.700వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తామన్నారు. మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉందని, ఎండు పసుపు కావిడ రూ.1500 నుంచి రూ.2 వేల వరకు విక్రయిస్తామని తెలిపారు. ఎండు పసుపు కొమ్ములు తయారు కావాలంటే చాలా పని ఉంటుంది. పచ్చి పసుపును ఉడకబెట్టి బాగా ఎండబెట్టి కాళ్లతో తొక్కినట్లయితే పైపొర పోతుందని దీన్ని వారపు సంతల్లో విక్రయి స్తామని గిరిజనులు తెలిపారు.

విత్తనాలు పంపిణీ చేస్తే బాగు



పసుపు విత్తనాలు పంపిణీ చేస్తే బాగుంటుంది. ఐటీడీఏ గతంలో పసుపు విత్తనాలు సరఫరా చేసేది. ఇప్పుడు పంపిణీ చేయడంలేదు. దీంతో ఈ విత్తనాలకోసం ఎదురు చూడాల్సి వస్తోంది. స్థానికంగా విత్తనాలు కట్టుకుని సాగుచేసుకుంటున్నాం.
– ఎస్.లక్కాయి, సీదిగూడ

గిట్టుబాటు ధర కల్పించాలి



పసుపు పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. జీసీసీనే పసుపు కొనుగోలు చేయడం లేదు. దీంతో దళారుల బారిన పడాల్సి వస్తోం ది. గిట్టుబాటు ధరలు కల్పించాలని గతంలో అనేక వినతులు కూడా సమర్పించాం.
– ఎస్.షోడంగ, చింతాడ

సంప్రదాయబద్ధంగా సిరిమాను సంబరం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: పైడిమాంబ సిరిమాను సంబరం సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని ఎంఎస్‌ఎంఈ సెర్ప్, ఎన్నారై వ్యవహార శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అక్టోబర్ 13, 14 తేదిల్లో విజయనగరం ఉత్సవాలు.. 14, 15 తేదిల్లో పైడితల్లి అమ్మవారి పండగ నిర్వహణపై శనివారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండగకు హాజరైన ప్రతి ఒక్కరికీ మధుర స్మృతులను మిగిల్చే విధంగా విజయనగరం ఉత్సవాలు, సిరిమాను సంబరం నిర్వహించాలని సూచించారు. ఈ ఉత్సవాలకు సుమారు ఐదారు లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని, వారికి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వ శాఖలన్నీ చక్కని సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉత్సవాలు, పండగ నిర్వహణకు రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలను రుపొందిస్తున్నట్లు చెప్పారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అమ్మవారి ఉత్సవాలకు ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు హాజరవుతారని తెలిపారు. సిరిమానోత్సవం త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ.. సామన్య భక్తులు దర్శనానికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అధితి గజపతి రాజు, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందల్, డీఆర్‌ఓ అనిత, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, ఆలయ ఈఓ ప్రసాదరావు, పూజారి బంటుపల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు

- దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 17 వరకు గడువు


విద్యార్థులు

విజయనగరం: మనదేశంలో ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించే భారతీయ రిజర్వ్ బ్యాంక్ 90వ ఏడాదిలోకి ప్రవేశించిన సందర్భంగా ఆర్బీఐ–90 పేరుతో దేశవ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనుంది. వివిధ స్థాయిల్లో జగరనున్న పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు రూపంలో బహుమతులు అందజేయనుంది.

పోటీ, నమోదు ఇలా..

క్విజ్ పోటీల్లో అంతర్జాతీయ, జాతీయ వ్యవహారాలు, ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ, ఆర్థిక వ్యవస్థ, సాహిత్య, చరిత్ర, ఆటలు, శాస్త్ర సాంకేతిక విషయాలతో పాటు సమకాలీన అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. పోటీల్లో తలపడేందుకు 2024 సెప్టెంబర్ 1 నాటికి 25 ఏళ్లలోపు ఉండి, ఏదైనా డిగ్రీ కళాశాలలో చదువుతున్నవారు అర్హులు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బీఐ90క్విజ్.ఇన్ వెబ్‌సైట్‌లో పేరు, ఐడీ, ఈమెయిల్, ఫోన్ నంబర్, తదితర వివరాలను ఈనెల 17వ తేదీ లోగా నమోదు చేసుకోవాలి. ఒక కళాశాల నుంచి ఎంతమందైనా పాల్గొనవచ్చు. ఒక జట్టులో ఇద్దరు తప్పనిసరిగా ఉండాలి. జిల్లా, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిల్లో ఆంగ్లం, హిందీ మాధ్యమాల్లో పోటీలు నిర్వహిస్తారు. ప్రతి స్థాయిలో విజేతలైన వారే తర్వాత దశకు అర్హత పొందుతారు.

విజేతలకు నగదు బహుమతులు

జిల్లా స్థాయిలో విజయం పొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులు. అక్కడ గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.2 లక్షలు, రెండో బహుమతిగా రూ.1.5 లక్షలు, మూడో బహుమతిగా రూ. లక్ష లభిస్తాయి. జోనల్ స్థాయిలో రూ.5 లక్షలు, రూ. 4 లక్షలు, రూ.3 లక్షలు వరుసుగా అందిస్తారు. అనంతరం జరిగే జాతీయ స్థాయి విజేతలకు రూ.10 లక్షలు, రూ.8 లక్షలు, రూ.6 లక్షలు ప్రైజ్‌మనీగా అందజేస్తారు. పోటీలు సెప్టెంబర్ 19 నుంచి 21వ తేదీ వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్ వేదికగా జరుగుతాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదవుతున్న వేల మంది విద్యార్థులకు ఇది సదవకాశం.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకలి కేకలు


బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో 11 మందికి గాను వచ్చిన ముగ్గురు చిన్నారులు

- మధ్యాహ్నం 12 గంటల వరకు వంట చేయని సిబ్బంది
- కొన్ని కేంద్రాల్లో కానిరాని చిన్నారులు
- మరి కొన్ని కేంద్రాల్లో విధులకు డుమ్మా కొట్టిన అంగన్‌వాడీలు


పిల్లలు లేక పోవడంతో ఖాళీగా ఉన్న బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం -2

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు సకాలంలో వంట చేయక పోవడం వల్ల పిల్లలు ఆకలితో ఇబ్బంది పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలైనా అంగన్‌వాడీ సిబ్బంది వంట చేయలేదు. పిల్లలకు ఎందుకు వంట చేయలేదని అంగన్‌వాడీ సిబ్బందిని అడిగితే సమాధానం చెప్పకుండా బిక్కమొఖం వేశారు. కొన్ని కేంద్రాల్లో రికార్డుల ప్రకారం పిల్లలు 10 నుంచి 15 మంది ఉంటే.. శనివారం ఒక్క పిల్లవాడు కూడా కేంద్రాలకు రాలేదు. మరికొన్ని కేంద్రాల్లో సిబ్బంది విధులకు డుమ్మా కొట్టారు. ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బొబ్బాదిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా, ఐదుగురు పిల్లలు ఉన్నారు. కార్యకర్త కేంద్రానికి వచ్చి వెళ్లిపోయారు. పిల్లలకు అప్పటివరకు వంట చేయలేదు. 11:45 ప్రాంతంలో బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం –1లో ముగ్గురు చిన్నారులు మాత్రమే ఉన్నారు. వాస్తవానికి ఇక్కడ ఉండాల్సిన చిన్నారుల సంఖ్య 11. ఈ కేంద్రంలో చిన్నారులకు వంట చేయలేదు. ఇదే ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ –3 లో 10 మంది పిల్లలకు గాను ఒక్కరు కూడా రాలేదు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో అంగన్‌వాడీ సెంటర్ –4లో 13 మంది పిల్లలకు గాను ఒక్క పిల్లవాడు లేడు. అలాగే అంగన్‌వాడీ సెంటర్ – 2 లో 12 మంది పిల్లలకు గాను ఒక్కరు కూడా రాలేదు. ఇదే విషయాన్ని అర్బన్ ఐసీడీఎస్ పీఓ జి. ప్రసన్న వద్ద సాక్షి ప్రస్తావించగా .. 12 గంటల వరకు ఎందుకు వంట చేయలేదో విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే చిన్నారుల గైర్హాజరుపై కూడా విచారణ చేస్తామని తెలిపారు.

ఓపీ సేవలు బంద్


గంట్యాడ పీహెచ్‌సీ వద్ద నిరసన తెలియజేస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు అవుట్ పేషెంట్ సేవలు నిలిపివేశారు. పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం జీఓ 85ను జారీ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీల్లో వైద్యులు దశల వారీగా నిరసన తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా 11, 12 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఉద్యమాన్ని ఉధృతం చేశారు. జిల్లాలో 54 పీహెచ్‌సీల్లోనూ శనివారం అత్యవసర వైద్యసేవలు మినహాయించి, ఓపీ సేవలను నిలిపివేశారు. ఇన్‌సర్వీస్ కోటా పెంచేవరకూ పోరాటం చేస్తామని వైద్యులు తెలిపారు.

డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిన యువకుడు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైనం
- డీజేలతో తలెత్తుతున్న సమస్యలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినయ్

రాజాం సిటీ: అంతవరకు అందరితో కలిసి డీజే ముందు డ్యాన్స్ చేసిన యువకుడు ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామంలో నిర్వహించిన వినాయక నిమజ్జనంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వావిలపల్లి వినయ్ అనే ఇరవై ఏళ్ల యువకుడు వినాయకుని నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే వద్ద డ్యాన్స్‌చేసి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. విషయం గమనించిన కొంతమంది యువకులు అతనిని పరిశీలించగా అపస్మారకస్థితిలో ఉన్నట్లు గుర్తించి సపర్యలు చేపట్టి ఇంటికి చేర్చారు. అక్కడ నుంచి రాజాంలోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. గుండె సంబంధిత సమస్యగా గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. అక్కడ నుంచి విశాఖపట్నం తరలించారు. డీజేల వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నా యువత పట్టించుకోకపోవడం విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై రాజాం టౌన్, రూరల్ సీఐలు కె.అశోక్‌కుమార్, హెచ్.ఉపేంద్ర వద్ద ప్రస్తావించగా.. డీజేలకు ఎటువంటి అనుమతుల్లేవన్నారు. వినాయక నిమజ్జనాల్లో డీజేలు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే..


సాధన చేస్తున్న క్రీడాకారులు (ఫైల్)

- స్కూల్ గేమ్స్ పోటీలు
- ఉత్సాహభరిత వాతావరణంలో మండల, నియోజకవర్గ స్థాయి పోటీలు
- ఈ నెల 18న జూడో, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో జిల్లా స్థాయి ఎంపికలు

విజయనగరం: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఇక్కడ విజయం సాధిస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల వరకు వెళ్లే అవకాశం ఉంటుంది. పోటీల్లో పాల్గొనేవారికి అధికారులు సర్టిఫికెట్లు అందజేస్తారు. దీంతో స్పోర్ట్స్ కోటాలో ఇంజినీరింగ్, మెడిసిన్, ఇతర కోర్సుల్లో సీట్లు పొందే అవకాశం ఉంది.

మండల, నియోజకవర్గ స్థాయిలో..

మండల, నియోజకవర్గసాయిలో అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చదరంగం విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఫుట్‌బాట్, హాకీ, హ్యాండ్‌బాల్, బాస్కెటబాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, వెయిట్ లిఫ్టింగ్, బాడీబిల్డింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, రోయింగ్, షూటింగ్, సైక్లింగ్, ఫెన్సింగ్, రోలర్ స్కేటింగ్, విలువిద్య, క్రికెట్, జూడో, స్క్వాష్ పోటీలు నిర్వహించనున్నారు. మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలు జిల్లా స్థాయికి.. ఇక్కడ విజయం సాధించిన వారు రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనే అవకాశం ఉంది. వ్యక్తిగత క్రీడలకు సంబంధించి మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు మాత్రమే రాష్ట్రస్థాయిలో పాల్గొంటారు.

ఎవరు పాల్గొనవచ్చు

పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చు. ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులే. అండర్–14 విభాగంలో పాల్గొనే బాల, బాలికలు 01.01.2011 తర్వాత జన్మించి ఉండాలి. అండర్–17 బాల, బాలికలు 01.01.2008 తర్వాత జన్మించిన వారై ఉండాలి.

18న జూడో, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో ఎంపికలు..

రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 18న నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. ఆ రోజు ఉదయం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో అండర్–14, అండర్–17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు ఫుట్‌బాల్ క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా అదే రోజు రామభద్రాపురం మండల కొట్టక్కి జిల్లా పరిషత్ స్కూల్‌లో అండర్–14,17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు జూడో క్రీడాంశంలో ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తిగల క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణపత్రంతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి స్టడీ సర్టిఫికేట్ వెంట తీసుకురావాలని సూచించారు.


పరుగు పందెంలో సాధన చేస్తున్న విద్యార్థినులు

కన్నులపండువగా కోడూరుమాత యాత్ర

- మేరీమాతను దర్శించుకున్న భక్తులు
- మొక్కుబడుల చెల్లింపు
- శాంతి సందేశాలిచ్చిన ఫాదర్లు


కోడూరుమాత పుణ్యక్షేత్రంలో నాల్గవ బలి పూజలో పాల్గొన్న విశాఖ అగ్రపీఠ గురువులు గురుశ్రీ ఆంథోని, పక్కన థామస్, రవితేజ

కోడూరు(బాడంగి): మండలంలోని కోడూరు గ్రామంలో కోడూరుమాత యాత్ర శనివారం కన్నులపండువగా సాగింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు విజయవాడ, గుంటూరు తదితర దూరప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో యాత్రకు తరలివచ్చారు. కోడూరు పుణ్యక్షేత్ర విచారణకర్త, ఫాదర్ యుగల్ కుమార్ ఆధ్వర్యంలో సాగిన దివ్యబలిపూజల్లో పాల్గొన్నారు. ఫాదర్లు చెప్పిన శాంతి సందేశాలను ఆలకించారు. తలనీలాలు సమర్పించారు. టెంకాయలు కొట్టి పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. విశాఖ అగ్రపీఠం నుంచి గురుశ్రీ ఆంథోని, థామస్, రవితేజ తదితరులు భక్తులకు మాత ఆశీర్వదాన్ని అందజేశారు. స్థానిక అధికారులు భక్తులకు తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, యాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నారాయణరావు ఆధ్వర్యంలో ఐదురుగు ఎస్‌ఐలు, 100 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు.


హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న ఫాదర్లు